నమస్తే తెలంగాణ
# జనగామ
5 | గురువారం 11 జనవరి 2024 | JANAGAON

# ఎక్స్‌రే గదికి తాళం!

**ఎంజీఎం ఎమర్జెన్సీ వార్డులో పని చేయని ఎక్స్‌రే మిషన్**

- వారం రోజులైనా మరమ్మతులు శూన్యం
- మంత్రి సమీక్షించినా మారని అధికారుల తీరు
- బయోకెమిస్ట్రీ ల్యాబ్‌లో సైతం రసాయనాల కొరత
- నిలిచిపోయిన రెనల్ ఫంక్షన్ టెస్ట్‌లు



ఎమర్జెన్సీ వార్డులో ఎక్స్‌రే మిషన్ పని చేయకపోవడంతో గదికి తాళం వేసిన సిబ్బంది

వరంగల్ చౌరస్తా, జనవరి 10: ఉత్తర తెలంగాణకు పెద్ద దిక్కుగా ఉన్న వరంగల్ ఎంజీఎం దవాఖానలో సేవలు అంతంత మాత్రంగా అందుతున్నాయని రోగులు వాపోతున్నారు. ఎమర్జెన్సీ వార్డులో ఎక్స్‌రే మిషన్ పనిచేయక వారం గడుస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని క్షతగాత్రులు ఆవేదన వ్యక్తం చేస్తునన్నారు. ఈ నెల మూడో తేదీ తెల్లవారుజామున ఎక్స్‌రే మిషన్ మొరాయించడంతో సేవలు నిలిచిపోయాయి. అత్యవసర చికిత్స పొందుతున్న రోగులను స్ట్రెచర్‌పై రేడియాలజీ విభాగానికి తరలించాల్సి వస్తున్నా మరమ్మతుల విషయంలో అధికారులు స్పందించడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రమాదాల్లో గాయపడిన వారి ఎముకల స్థితిని తెలుసుకునేందుకు ఎక్స్‌రే తీయాల్సి ఉంటుంది. అయితే, అత్యవసర విభాగంలో అందుబాటులో లేకపోవడంతో రోగులతోపాటు వైద్య సిబ్బంది సైతం ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తున్నా సంబంధిత అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

**రోగులకు తప్పని ఇబ్బందులు**

చాలాకాలంగా బయోకెమిస్ట్రీ ల్యాబ్‌లో మూత్రపిండాల పనితీరును పరీక్షించే రెనల్ ఫంక్షన్ టెస్ట్‌లు నిలిచిపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిత్యం వంద వరకు నిర్వహించే ఈ పరీక్షలు నెల రోజులుగా రసాయనాలు అందుబాటులో లేకపోవడం వల్ల నిలిచిపోయినట్లు తెలుస్తున్నది. బయోకెమిస్ట్రీ ల్యాబ్‌లో సీరం క్రియాటిన్, బ్లడ్ యూరియా పరీక్షలు కొనసాగడం లేదని పలువురు ఎంజీఎం ఉద్యోగులు, సిబ్బంది సైతం బహిరంగంగానే చెబుతున్నారు. అయితే వైద్య సేవల్లో ఎలాంటి ఆటంకాలు లేవని, అన్ని రకాల రసాయనాలు అందుబాటులోనే ఉన్నాయని ఇటీవల డిసెంబర్ 31న జరిగిన సమీక్షలో అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ తెలియజేయడంతోపాటు భవిష్యత్‌లో ఇబ్బందులు కలుగకుండా చూడాలని ఆదేశాలు జారీ చేశారు. అయినా అధికారులు అందుకు తగిన విధంగా స్పందించకపోవడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి వైద్య సేవలు నిరాటంకంగా కొనసాగేలా చర్యలు తీసుకోవాలని రోగులు, అటెండెంట్లు కోరుతున్నారు.

# 69 రోజులు.. రూ. 23.58 లక్షలు

**ఇదీ కాళేశ్వరం హుండీ ఆదాయం**


హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న సిబ్బంది, భక్తులు

కాళేశ్వరం జనవరి 10 : కాళేశ్వర ముక్తీశ్వర స్వామి వారి హుండీ ద్వారా రూ.23.58,715ల ఆదాయం వచ్చినట్లు ఈవో మహేశ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆలయ ఆవరణలో బుధవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు చైర్మన్ లింగంపల్లి శ్రీనివాస్‌రావు, ఈవో మహేశ్, ఇన్‌స్పెక్టర్ అనిల్ పర్యవేక్షణలో హుండీలను లెక్కించారు. 69 రోజులకు గాను రూ. 23.58లక్షల ఆదాయం వచ్చింది. కార్యక్రమంలో ఆలయ పర్యవేక్షకుడు బుర్రి శ్రీనివాస్, ధర్మకర్తలు రాంరెడ్డి, శ్యాంసుందర్, బండి రాజయ్య పాల్గొన్నారు.



హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో నిర్వహించిన వరంగల్ లోక్‌సభ నియోజకవర్గ పరిధి ముఖ్యనేతల సమావేశంలో మాట్లాడుతున్న కేటీఆర్




# వరంగల్‌లో గులాబీ జెండా ఎగరాలి

- రెండు సీట్లూ మనమే గెలవాలి
- ఓరుగల్లు అంటే ఉద్యమాల వీరగడ్డ
- బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- వరంగల్ లోక్‌సభ సెగ్మెంట్ పరిధి నేతలతో సమావేశం
- పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం

'ఓరుగల్లు అంటేనే ఉద్యమాల వీరగడ్డ.. ఓరుగల్లు మన జయశంకర్ సార్ పుట్టిన నేల.. పార్లమెంట్ ఎన్నికల్లో వరంగల్‌లో గులాబీ జెండా ఎగరాలి.. ఇందుకోసం బీఆర్‌ఎస్ శ్రేణులు కృషి చేయాలి' అని పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కోరారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో బుధవారం జరిగిన వరంగల్ లోక్‌సభ నియోజకవర్గ సన్నాహక సమావేశంలో బీఆర్‌ఎస్ శ్రేణులనుద్దేశించి కేటీఆర్ ప్రసంగించారు. లోక్‌సభ ఎన్నికల్లో వరంగల్, మహబూబాబాద్ స్థానాలను బీఆర్‌ఎస్ గెలుస్తుందని చెప్పిన ఆయన, ఎన్నికల్లో గెలుపు కోసం నేతలకు దిశానిర్దేశం చేశారు.

– వరంగల్, జనవరి 10 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)

2014 ,2019లో వరంగల్ ఎంపీ స్థానాన్ని బీఆర్‌ఎస్ గెలిచిందని, ఈ సారి కూడా వరంగల్‌లో గులాబీ జెండా ఎగరాలని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. వరంగల్ లోక్‌సభ నియోజకవర్గ పరిధి నేతలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉద్యమాలతో రాష్ట్రాన్ని సాధించిన కేసీఆర్, అప్పటి వరకు విధ్వంసమైన తెలంగాణను పదేండ్లు కష్టపడి వికాసం వైపు మళ్లించారని గుర్తుచేశారు. గ్రామీణ ఆర్థిక పరిపుష్టికి కేసీఆర్ కష్టపడ్డంతగా దేశంలో ఎవరూ కష్టపడలేదని చెప్పారు. కరెంటు పరిస్థితిని ఎవరు బాగు చేశారని చిన్నపిల్లవాడిని అడిగినా కేసీఆర్ అని చెబుతారన్నారు. కాంగ్రెస్ అబద్ధాలు చెప్పి తప్పించుకోవాలని చూస్తే ప్రధాన ప్రతిపక్షంగా నిలదీస్తామని హెచ్చరించారు. తెలంగాణను సత్వరం అభివృద్ధి చేయాలన్న తపనతో 99 శాతం సమయాన్ని పాలనకే కేటాయించామని, పరిపాలనపై పూర్తి దృష్టి కేంద్రీకరించి పార్టీకి కొంత తక్కువ సమయం వెచ్చించామని చెప్పారు. ఇలాంటి సమావేశాలు ఎప్పటికప్పుడు నిర్వహించుకుంటూ పార్టీని బలోపేతం చేసే దిశగా ముందుకు పోతామన్నారు. పార్టీ పరంగా లోపాలను సమీక్షించుకుంటామని, పార్లమెంట్ ఎన్నికల నాటికి మరింత బలోపేతం చేసుకుంటామన్నారు. అసెంబ్లీ ఎన్నికల ఫలితాలను పక్కనబెట్టి పార్లమెంట్ ఎన్నికలపై దృష్టి సారించి విజయం దిశగా పనిచేద్దామని పిలుపునిచ్చారు. కార్యకర్తల్లో ఉత్సాహం యథావిధిగా ఉందని, ఇదే చైతన్యంతో పార్లమెంటు ఎన్నికల్లో గట్టిగా పని చేయాలన్నారు. 'కాంగ్రెస్ ఇచ్చింది ఆరు గ్యారెంటీలు కాదు, 420 హామీలు. ఇదే విషయాన్ని కార్యకర్తలు ప్రజలకు గుర్తు చేస్తూనే ఉండాలి. నిరుద్యోగ భృతి హామీ ఇవ్వనే లేదని అసెంబ్లీ సాక్షిగా భట్టి అబద్ధమాడారు. కాంగ్రెస్ నిజ స్వరూపాన్ని, ఆ పార్టీ 420 హామీలపై ఎండగట్టాలి. నెలరోజుల్లోనే కాంగ్రెస్ పాలనపై ప్రజల్లో వ్యతిరేకత మొదలైంది. ప్రజలకు మంచి చేసే అనేక సంక్షేమ పథకాలను కాంగ్రెస్ రాజకీయ అక్కసుతో రద్దు చేస్తున్నది. కేంద్ర ప్రభుత్వ విధానాలు పేదలను నష్టపరిచాయి. ఈ అంశాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే బీఆర్‌ఎస్ కార్యకర్తలపై తప్పుడు కేసులు పెడుతున్నది. కేసులకు భయపడేది లేదు. బీఆర్‌ఎస్‌కు పటిష్టమైన లీగల్ సెల్ ఉంది. తప్పుడు కేసుల బాధితులకు పార్టీ లీగల్ సెల్ అండగా ఉంటుంది. తప్పుడు కేసులను ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు సీరియస్‌గా తీసుకుని పోరాడాలి. ఒక బీఆర్‌ఎస్ ఎంపీపీపై కేసు పెడితే మిగతా బీఆర్‌ఎస్ ఎంపీపీలంతా స్పందించాలి. ఎక్కడికక్కడ తప్పుడు కేసులపై నాయకులు సమష్టిగా స్పందించాలి. కేసుల తీవ్రతను బట్టి రాష్ట్ర నాయకత్వం స్పందిస్తుంది' అని కేటీఆర్ అన్నారు. సమావేశంలో వరంగల్ ఎంపీ పసునూరి దయాకర్, ఎమ్మెల్సీలు సిరికొండ మధుసూదనాచారి, బండా ప్రకాశ్, బస్వరాజు సారయ్య, పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, మాజీ మంత్రులు ఎర్రబెల్లి దయాకర్‌రావు, సత్యవతి రాథోడ్, పొన్నాల లక్ష్మయ్య, ప్రణాళికా సంఘం మాజీ ఉపాధ్యక్షుడు బీ వినోద్‌కుమార్, బీఆర్‌ఎస్ జిల్లా పార్టీల అధ్యక్షులు దాస్యం వినయ్‌భాస్కర్, అరూరి రమేశ్, గండ్ర జ్యోతి, మేయర్ గుండు సుధారాణి, జడ్పీ చైర్మన్ ఎం.సుధీర్‌కుమార్, డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు, మాజీ ఎమ్మెల్యేలు చల్లా ధర్మారెడ్డి, అరూరి రమేశ్, గండ్ర వెంకటరమణారెడ్డి, నన్నపునేని నరేందర్, మున్సిపాలిటీల చైర్మన్లు, కార్పొరేషన్ మాజీ చైర్మన్లు, ఎంపీపీలు, జడ్పీటీసీలు, కార్పొరేటర్లు, కౌన్సిలర్లు, మండలాల అధ్యక్షులు పాల్గొన్నారు.

# ప్రజలను మభ్యపెడుతున్న కాంగ్రెస్


జెండా ఊపి ప్రయాణాన్ని ప్రారంభిస్తున్న దాస్యం వినయ్ భాస్కర్

హనుమకొండ, జనవరి 10 : అబద్ధపు హామీలు, వారంటీ లేని గ్యారెంటీలతో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని, బీఆర్‌ఎస్‌పై అసత్య ప్రచారాలతో రోజులు గడుపుతూ ప్రజలను మభ్యపెడుతున్నదని బీఆర్‌ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు, మాజీ చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్ విమర్శించారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో బుధవారం జరిగిన పార్టీ సమీక్ష సమావేశానికి శ్రేణులు ప్రత్యేక వాహనంలో బయలుదేరి వెళ్లగా ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ప్రజాపాలన పేరుతో ప్రజలను కాంగ్రెస్ అనేక ఇబ్బందులకు గురిచేస్తున్నదని, ఒక్కో మంత్రి ఒక్కో తీరుగా మాట్లాడుతూ ప్రజలను గందరగోళంలో పడేస్తున్నారని దుయ్యబట్టారు. రైతుబంధు, పెన్షన్లు సకాలంలో అందక లబ్ధిదారులు ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. తెలంగాణ రాష్ట్ర హక్కులను సాధించుకోవాలంటే పార్లమెంటులో బీఆర్‌ఎస్ ఎంపీలు ఉండాలన్నారు. ఏ రోజు కూడా పార్లమెంట్‌లో తెలంగాణ అభివృద్ధి గురించి గాని, హామీల గురించిగాని కాంగ్రెస్ మాట్లాడలేదని గుర్తు చేశారు. ఇక్కడ కుడా మాజీ చైర్మన్ సుందర్ రాజు యాదవ్, వరంగల్ పశ్చిమ నియోజకవర్గ కన్వీనర్ తాళ్లపల్లి జనార్దన్ గౌడ్, కార్పొరేటర్లు విజయలక్ష్మి, బొంగు అశోక్ యాదవ్, చెన్నం మధు, సోదా కిరణ్, సంకు నర్సింగ్, గుంటి రజిత శ్రీనివాస్, నాయకులు పులి రజినీకాంత్, చింతాకుల ప్రభాకర్, నయీముద్దీన్ ఉన్నారు.



మిర్చి క్రయ, విక్రయాలపై అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్ ప్రావీణ్య

# మిర్చికి గిట్టుబాటు ధర ఇవ్వండి

- రాష్ట్రంలోని ఇతర మార్కెట్ల ధరను పరిశీలించాలి
- నాణ్యత, తేమపై రైతులకు అవగాహన కల్పించాలి
- అధికారులకు వరంగల్ కలెక్టర్ ప్రావీణ్య ఆదేశాలు

ఖిలావరంగల్, జనవరి 10 : వరంగల్ ఎనుమాముల వ్యవసాయ మార్కెట్‌లో మిర్చికి గిట్టుబాటు ధర కల్పించేలా అధికారులు చర్యలు చేపట్టాలని కలెక్టర్ పీ ప్రావీణ్య ఆదేశించారు. కలెక్టరేట్‌లో బుధవారం ఆమె జిల్లా మార్కెటింగ్ అధికారి పీ ప్రసాదరావుతో కలిసి మార్కెట్ యార్డులో మిర్చి క్రయవిక్రయాలు, ధరలపై సమీక్షించారు. మూడు నెలల వరకు మార్కెట్‌కు మిర్చి ఎక్కువగా వచ్చే అవకాశం ఉన్నందున అప్రమత్తంగా ఉండాలన్నారు. నిత్యం పర్యవేక్షిస్తూ రైతులకు గిట్టుబాటు ధర కల్పించేలా చూడాలని సూచించారు. మిర్చి నాణ్యత, తేమ శాతంపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. రాష్ట్రంలోని వివిధ మార్కెట్లలో మిర్చి ధరను ఎప్పటికప్పుడు తెలుసుకొని, అందుకనుగుణంగా క్రయవిక్రయాలు జరిగేలా ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. తరచూ మార్కెట్‌ను సందర్శిస్తూ క్రయవిక్రయాలను పర్యవేక్షించి తనకు నివేదిక ఇవ్వాలని కలెక్టర్ ఆదేశించారు. చాంబర్ ఆఫ్ కామర్స్ మిర్చి వ్యాపారులు తెలిపిన వివరాల ప్రకారం.. ఏటా ఇండోనేషియా, బంగ్లాదేశ్, చైనా దేశాలకు మిర్చి ఎగుమతి చేస్తున్నామని, ప్రస్తుతం ఆ దేశాల నుంచి ఎలాంటి ఆర్డర్లు రాలేదన్నారు. రైతులు తమకు గిట్టుబాటు ధర రాలేదని భావిస్తే కోల్డ్ స్టోరేజీల్లో నిల్వ చేసి ఆరు నెలల వరకు ఎలాంటి వడ్డీ లేని రూ. 2 లక్షల వరకు రుణం పొందొచ్చని రైతులను వారు కోరారు.

*కాకతీయ యూనివర్సిటీలోని పరీక్షల విభాగంలో ఉద్యోగులు చేతివాటం ప్రదర్శిస్తున్నారు. రూ.2500 ఇస్తేనే డిగ్రీ సర్టిఫికెట్ ఇస్తామని డిమాండ్ చేస్తున్నారని పలువురు విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల కేయూలో కాంట్రాక్టర్ నుంచి రూ.50వేలు లంచం తీసుకుంటూ అసిస్టెంట్ రిజిస్ట్రార్, ఆడిట్ ఆఫీసర్ కిష్టయ్య ఏసీబీకి పట్టుబడినా ఉద్యోగుల్లో మాత్రం మార్పు రావడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. డిగ్రీ, పీజీ పూర్తయి నెలలు గడుస్తున్నా సర్టిఫికెట్లు ఇవ్వకపోవడంతో ఎగ్జామినేషన్ బ్రాంచ్‌లో ప్రతి రోజూ పడిగాపులు కాస్తున్నామని.. వారి నిర్లక్ష్యం వల్ల ప్రభుత్వ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకోలేకపోతున్నామని వాపోతున్నారు.*

*– హనుమకొండ చౌరస్తా, జనవరి 10*



కాకతీయ యూనివర్సిటీలోని ఎగ్జామినేషన్ బ్రాంచ్

# రూ.2500 ఇస్తేనే సర్టిఫికెట్

- డబ్బులిస్తేనే ఇస్తామని సిబ్బంది ఆర్డర్
- లేకుంటే క్యాండిడేట్ రావాలని హుకుం
- కేయూ పరీక్షల విభాగంలో చేతివాటం
- ఇటీవల ఏసీబీకి పట్టుబడినా మారని ఉద్యోగుల తీరు

ఉమ్మడి వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాల్లోని వేలాది మంది విద్యార్థులు కేయూ పరిధిలో డిగ్రీ, పీజీ చదువుతున్నారు. చదువు పూర్తయి సర్టిఫికెట్ల కోసం దరఖాస్తు చేసుకున్నా నెలల తరబడి తిప్పుతున్నారని బాధితులు ఆరోపిస్తున్నారు. ఆన్‌లైన్‌లో షార్ట్ మెమో కోసం వెయ్యి అదనంగా చెల్లించినా నిర్ణీత గడువులోగా సర్టిఫికెట్లు ఇవ్వడం లేదు. చదువుకున్న కాలేజీకి వెళ్తే ఇంకా సర్టిఫికెట్లు రాలేదు యూనివర్సిటీకి వెళ్లి తెచ్చుకోవాలని చెబుతున్నారు. తీరా ఇక్కడికి వస్తే డబ్బులు డిమాండ్ చేస్తున్నారని ఆదిలాబాద్, కొత్తగూడెం నుంచి వచ్చిన విద్యార్థులు తెలిపారు. డిగ్రీ లాంగ్ మెమో కోసం శనివారం వస్తే ఎగ్జామినేషన్ బ్రాంచ్‌లో సర్టిఫికెట్లు ఇచ్చే ఉద్యోగి కిషన్ ఏకంగా రూ.2500 ఇవ్వాలని డిమాండ్ చేశాడని రూ.500 ఇస్తే తీసుకోలేదని వారు చెప్పారు. డబ్బులు అడిగినంత ఇవ్వకపోవడంతో సర్టిఫికెట్లు కాలేజీకి పంపామని కసురుకున్నాడని ఆవేదన వ్యక్తంచేశారు, ఇంతకు మీరు సర్టిఫికెట్ ఇస్తారా? ఇవ్వరా చెప్పండి అంటూ అడిగితే కాలేజీకి పంపాం.. అక్కడికి వెళ్లి తీసుకోపోండి అంటూ నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నారని వివరించారు. తీరా కాలేజీకి ఫోన్ చేస్తే మేం తీసుకురాలేదు యూనివర్సిటీలోనే ఉన్నాయని బదులిచ్చినట్లు చెప్పారు. అదేమిటి ఇక్కడే ఉన్నాయా అని నిలదీస్తే అవును ఉన్నాయి వెతకాలి కదా మీరు మళ్లీ సోమవారం రండి అంటూ హుకుం వేసినట్లు చెప్పారు. మళ్లీ బుధవారం వస్తే తిప్పించుకుంటున్నారని ఎగ్జామినేషన్ బ్రాంచ్‌లో సుమన్ అనే ఉద్యోగి డబ్బులిస్తే తొందరగా అయిపోతుందని, ఎంతో కొంత ఇచ్చి తీసుకుపోండి అంటున్నారని బాధిత విద్యార్థులు ఆరోపిస్తున్నారు. డబ్బులు ఇవ్వకపోతే క్యాండిడేట్ రావాలని లేకపోతే సర్టిఫికెట్ ఇవ్వమంటున్నారని, మదర్ బేబీ ఉన్నా కూడా సర్టిఫికెట్ ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. డబ్బులిస్తేనే సర్టిఫికెట్లు ఇస్తున్నారని, లేకుంటే తిప్పుకుంటున్నారని, ఈ విషయమై అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు.

**ఉద్యోగులకు అలవాటైపోయింది..**

ఎగ్జామినేషన్ బ్రాంచ్‌లోని ఉద్యోగులకు డబ్బులు తీసుకోవడం అలవాటైపోయింది. డబ్బులు తీసుకుంటున్నారా అని నేను అడిగేతే మేం అడగలేదు, తీసుకోలేదంటున్నారు. సర్టిఫికెట్ల కోసం రెండు, మూడుసార్లు తిరిగితే ఖర్చులవుతాయి కదా అందుకే అవే డబ్బులు మా ఉద్యోగులకు ఇచ్చి సర్టిఫికెట్లు తీసుకెళ్తున్నారు. గతంలో కూడా నా దృష్టికి వస్తే వారిని మార్చేశాను. సర్టిఫికెట్లు తీసుకోవడానికి యూనివర్సిటీ సంబంధించిన చలాన్ ద్వారానే చెల్లించాలి. డబ్బులు ఇవ్వకూడదు. తీసుకుంటే ఒకసారి రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకుందాం. సిబ్బందికి ఫోన్ పే చేసినట్లు ప్రూఫ్ ఉంటే చర్యలు తీసుకోవచ్చు.

– ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి, కేయూ పరీక్షల నియంత్రణాధికారి

# కమనీయం.. వీరభద్రుడి కల్యాణం

- కొత్తకొండలో అంగరంగ వైభవంగా వేడుక
- పట్టువస్త్రాలు సమర్పించిన మంత్రి పొన్నం ప్రభాకర్ దంపతులు


స్వామి వారికి తలంబ్రాలు సమర్పిస్తున్న మంత్రి పొన్నం దంపతులు


వేదమంత్రోచ్ఛారణల నడుమ కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

భీమదేవరపల్లి, జనవరి 10 : కొత్తకొండ వీరభద్ర స్వామి కల్యాణం బుధవారం రాత్రి కన్నులపండువగా జరిగింది. మకర సంక్రాంతిని పురస్కరించుకుని జరిగే బ్రహ్మోత్సవాలు కల్యాణంతో ప్రారంభమయ్యాయి. తొలుత ఆలయంలో ధ్వజారోహణం నిర్వహించి వేదమంత్రోచ్ఛారణల నడుమ అర్చకులు భద్రకాళీ సమేత వీరభద్రస్వామి ఉత్సవమూర్తులను పల్లకీలో తీసుకొని వచ్చి కల్యాణమండపంలో అందంగా అలంకరించారు. రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సతీసమేతంగా హాజరై పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ అంగరంగ వైభవంగా కల్యాణం జరిపించగా ఈ ఘట్టాన్ని తిలకించేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. సెంట్రల్ జోన్ డీసీపీ మహ్మద్ బారి, కాజీపేట ఏసీపీ డేవిడ్ రాజు, సీఐ ప్రవీణ్‌కుమార్, ఎస్సై సాయిబాబు బందోబస్తు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ అనిత, సర్పంచ్ ప్రమీల, ఎంపీటీసీ రాజమణి, ఈవో కిషన్ రావు, ఉప ప్రధాన అర్చకులు రాజయ్య, ముఖ్య అర్చకులు రాంబాబు, శ్రీకాంత్, వినయ్, రమేశ్, శ్రావణ్, ఆలయ మాజీ చైర్మన్ చంద్రశేఖర్‌గుప్తా, పిడిశెట్టి కనుకయ్య, కుమారస్వామి పాల్గొన్నారు.

# సాగునీటిని పొదుపుగా వాడుకోవాలి

- వారబందీ పద్ధతిలో ఆరుతడి పంటలకు నీళ్లు: ఈఈ

వరంగల్, జనవరి 10 (నమస్తే తెలంగాణ): శ్రీరాంసాగర్ ప్రాజెక్టు తొలిదశలోని కాల్వల ద్వారా వరంగల్ జిల్లాలోని ఆయకట్టుకు వారబందీ పద్ధతిన సాగునీటిని సరఫరా చేస్తున్నట్లు నీటి పారుదల శాఖ కార్యనిర్వాహక ఇంజినీర్ బి.ఆంజనేయులు తెలిపారు. నీటి లభ్యత తక్కువగా ఉన్నందున సాగునీటిని పొదుపుగా వాడుకోవాలని ఆయన రైతులను కోరారు. యాసంగి సాగు కోసం ఈ నెల ఒకటి నుంచి మార్చి నెలాఖరు వరకు ఎస్సారెస్పీ కాల్వల ద్వారా ఆయకట్టుకు సాగునీరు సరఫరా చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈమేరకు ఆరుతడి పంటల కోసం 90 రోజుల పాటు కాకతీయ ప్రధాన కాల్వ ద్వారా కరీంనగర్ ఎల్ఎండీ నుంచి నీటి విడుదలకు సాగునీటి శాఖ అధికారులు ప్రణాళిక తయారు చేశారు. బుధవారం ఈఈ ఆంజనేయులు 'నమస్తే తెలంగాణ'తో మాట్లాడుతూ యాసంగి పంటల సాగుకు ఈ నెల ఒకటిన ఎస్సారెస్పీ నీరు విడుదల చేశామని, ఆరుతడి పంటల కోసం వారబందీ పద్ధతిన ఒక వారం కొన్ని కాల్వల ద్వారా, మరో వారం మరికొన్ని కాల్వల ద్వారా ఆయకట్టుకు నీటి సరఫరా చేస్తామన్నారు. శ్రీరాంసాగర్, లోయర్ మానేరు డ్యామ్, ఇతర రిజర్వాయర్లలో తగినంత నీటి లభ్యత లేనందున చివరి ఆయకట్టుకు సరిపడా నీరిచ్చే అవకాశం లేదని ఈఈ పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో బావి, బోరు వసతి ఉన్న చివరి ఆయకట్టు రైతులు కాల్వల నీటిపై ఆధారపడకుండా ఆరుతడి పంటలు సాగు చేసుకోవడం మంచిదని సూచించారు. రైతులు తమ సిబ్బందికి సహకరించాలని ఈఈ కోరారు.